● కఠిన చర్యలు తప్పవు..

అటవీ జంతువులను పెంచుకోవడం, వేటాడటం, పూర్తిగా నిషేధం. మన పరిసరాల్లోనూ వాటిని మచ్చిక చేసుకోవడంతోపాటు మాంసం కలిగి ఉండటం నేరమని వన్యప్రాణుల చట్టం 1972 చెబుతోంది. ఈ చట్టంలో ఇటీవల కొన్ని మార్పులు చేశారు. నిందితులకు ఏడేళ్ల జైలు, రూ.50లక్షల వరకు జరిమాన విధించవచ్చునని అధికారులు చెబుతున్నారు. అంతరించుపోతున్న వన్య ప్రాణుల రక్షణ అందరి కర్తవ్యం. గ్రామ పరిసరాల్లోకి అటవీ జంతువులు వస్తే వాటికి హాని తలపెట్టకుండా అధికారులకు తెలియజేయాలి. పొలాల్లోకి అటవీ జంతువులు వస్తే.. వాటి వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయటం, ఉచ్చులు, వలలు అమర్చడం చట్టరీత్యా నేరం.

● మహేంద్రగిరుల్లో ఉచ్చులు, వలలు
● జనావాసాల్లోకి వన్యప్రాణులు
● యథేచ్ఛగా వేటగాళ్ల ఆగడాలు
● చోద్యం చూస్తున్న అధికారులు

అడవిలో అలజడి



● కొన్నాళ్ల కిందట మందస సమీపంలోని ఓ చెరువు వద్దకు నీరు తాగేందుకు వచ్చిన కణుజును విద్యుత్ వైర్లు పెట్టి హతమార్చిన దృశ్యమిది. నీరులేక అల్లాడుతున్న వన్యపాణులు మహేంద్రగిరుల నుంచి మైదానప్రాంతాల్లోకి, జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆ మార్గాల్లో, చెరువుల్లో అమర్చిన తీగలు వాటి పాలిట మృత్యువవుతున్నాయి.

హరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాలమైన అటవీ ప్రాంతం.. సిక్కోలు సొంతం. తూర్పుకనుముల్లోని ఎత్తయిన పర్వత శ్రేణులు మహేంద్రగిరుల్లో విలువైన అటవీ సంపద, సహజ వనరులు.. ప్రకృతి విలాపానికి, మానవ తప్పిదాలకు కకావికలమవుతున్నాయి. ఎత్తయిన కొండలు, దట్టమైన చెట్లు కనుమరుగవుతున్నాయి. దీంతో వన్యప్రాణులు జన సంచారంలోకి వస్తున్నాయి. వేటగాళ్ల ఉచ్చులో పడి బలవుతున్నాయి. మహేంద్ర గిరులు అరుదైన జంతు, వృక్ష జాతులకు నెలవు. సువిశాలమైన ఈ ప్రాంతం వన్యప్రాణులకు ఎంతో భద్రమైనదిగా పేరొందింది. అటువంటి అడవిలో ఇప్పుడు అలజడి రేగుతోంది. ఇక్కడి వన్యప్రాణులపై వేటగాళ్ల కళ్లు పడ్డాయి. ఉచ్చులు అమర్చుతూ.. వలలు ఏర్పాటు చేస్తూ యథేచ్ఛగా వేట సాగిస్తున్నారు. పెద్దపులులు మొదలు కొని అడవి కోళ్ల వరకు ప్రాణుల ఉసురు తీస్తున్నారు. మహేంద్ర గిరుల్లో జీవించే పులులు, చిరుతలు, ఏనుగులు, జింకలు, దుప్పిలు, నక్కలు, అడవి కుక్కలు, కుందేళ్లు, అడవికోళ్లు, ఎలుగుబంట్లు, కనుజులు, దుప్పి వంటి అనేక వన్యపాణులను మట్టుబెడుతున్నారు.



● మందస మండలం బొగాబంద పంచాయతీ గోపాల సాయి గ్రామంలో గిరిజనులు ఇటీవల భారీ కొండచిలువ పామును హతమార్చారు. సమీప కొండల నుంచి గ్రామంలోకి వచ్చిన 12 అడుగుల పాము.. మేకపిల్లను మింగేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు చూసి దానిని చంపేశారు.



● మందస మండలం బొగాబంద సమీపంలో గ్రానైట్ కోసం కొండను తవ్వి.. ఇలా చెరువులా మార్చేశారు. దీంతో ఎన్నో వన్యప్రాణులకు నిలయమైన ఈ ప్రాంతం నిలువ నీడలేకుండా పోయింది.

● అగ్గిపెట్టి.. ఆక్రమించి..

జిల్లాలో 16 మండలాల పరిధిలో 67,466 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో అత్యంత విలువైన కలప, అటవీ జంతువులు ఉన్నాయి. కొంతమంది అక్రమార్కులు స్వార్థంతో అడవులకు నిప్పుపెట్టి విలువైన సంపదను కొల్లగొడుతున్నారు. మరికొందరు అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. గతేడాది జిల్లాలో సుమారు 12వేల హెక్టార్లలో అడవులు అగ్నికి ఆహుతయ్యాయని అధికారులు అంచనావేశారు. మందస ప్రాంతంలో బుడంబో నుంచి బుడార్సింగి వరకు చిన్నచిన్న కొండలు, అటవీ ప్రాంతాలు (మిగతా 6వ పేజీలో..)



బుడార్సింగి వద్ద దట్టమైన అటవీ ప్రాంతంలోని కంకర తవ్వకాలతో రూపుమారిన కొండ



సీఎం చంద్రబాబుకు వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమగ్రాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన కలెక్టర్

శ్రీకాకుళం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. రెండోరోజు విజయవాడలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా సమాచారాన్ని.. ఇతరత్రా విషయాలను కలెక్టర్ వివరించారు. విజన్ -2047 లక్ష్యాన్ని.. జిల్లాలో కొత్తగా అమలు చేయబోయే కార్యక్రమాలు.. ప్రాజెక్టుల వివరాలను ముఖ్యమంత్రికి తెలిపారు. కలెక్టరేట్ నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అక్కడ సమావేశాన్ని వీక్షించారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. శ్రీకాకుళంలోని జిల్లాకోర్టు ఆవరణలో గురువారం జిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే గురువారం ప్రీ లోక్‌అదాలత్‌లో భాగంగా ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రెండు కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఒకటి, మూడవ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.భాస్కరరావు, వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్.ఎం.ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

డేంజర్.. డేంజర్!

● యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
● ప్రజల్లో కొరవడిన చైతన్యం
● పర్యావరణానికి తీవ్ర ముప్పు
● మొక్కుబడిగా అధికారుల దాడులు

పలాస, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ప్లాస్టిక్ పెనుభూతంగా మారి మానవాళికి సవాల్ విసురుతోంది. అధికారుల నియంత్రణ కొరవడడంతో యథేచ్ఛగా ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం పెరిగిపోతోంది. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ప్రతిరోజు 60టన్నుల వరకూ చెత్త సేకరిస్తున్నారు. అందులో 50 శాతం కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. అంతగా ప్లాస్టిక్ ప్రజల్లో మమేకమైపోయింది. కూరగాయలైనా, చేపలైనా, తినుబండారాలైనా, వస్త్రాలు, నిత్యావసరాలు.. ఇలా ఏవి తీసుకురావాలన్నా.. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లే అధికంగా వినియోగిస్తున్నారు. పర్యావరణానికి ముప్పు అని తెలిసినా.. వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లోను, రోడ్లపైన పారబోస్తున్నారు. దీంతో ఎక్కడిపడితే అక్కడ వ్యర్థనీరు కాలువల్లో నిలిచిపోయి.. రోడ్లపై రోజుల తరబడి మురుగునీరు ఉండిపోతోంది. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమాల పేరిట ప్లాస్టిక్ వ్యర్థాలపైనే పోరు సాగిస్తున్నా వృథా ప్రయాసే అవుతోంది.

● వంద మైక్రాన్‌ల కంటే ఎక్కువ ఉండే ప్లాస్టిక్ వినియోగిస్తే రీసైకిల్ చేయవచ్చని, దీన్ని వినియోగించినా ఇబ్బందులు ఉండవని కేంద్ర పర్యావరణశాఖ ఈ ఏడాది జూలై 1న ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిని అన్నీ రాష్ట్రాల్లో అమలు చేయాలని స్పష్టం చేసింది. దీని ప్రకారం సంబంధిత తయారీ సంస్థలు, కేంద్రాలు తమ సంస్థల పేర్లు, చిరునామా, పరిణామం తప్పనిసరిగా ముద్రించాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై రూ.లక్ష వరకూ అపరాధ రుసుం, ఏడాది జైలు విధించబడుతోంది. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వ్యవహారం అంశం లేవనెత్తినప్పుడు కౌన్సిలర్లు ఆందోళన చేయడం, అధికారులు రెండుమూడు రోజులు హడావుడి చేసి వెళ్లిపోవడం సాధారణంగా జరుగుతోంది. అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు మళ్లీ అదే షాపులకు విక్రయించడం, కొన్ని సంస్థల నుంచి నేరుగా నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రతినెలా రూ.25లక్షల విలువైన ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతుండడం గమనార్హం.

అనర్థాలివే..

రోడ్లు, కాలువల్లో ప్లాస్టిక్ పారబోయడం వల్ల పశువులు, మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. ఏడాదిలో జిల్లాలో పదుల సంఖ్యలో పశువులు మరణిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

- ప్రధానంగా కాలువల్లో వీటి వ్యర్థాల వల్ల నీరు నిల్వ ఉండిపోతోంది. దోమలు, ఈగలు ఎక్కువై అంటురోగాలు ప్రబలుతున్నాయి

- ప్లాస్టిక్‌కు నిప్పుపెట్టి బూడిద చేయడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతుంది. శ్వాసకోసవ్యాధులు కూడా వచ్చే అవకాశాలు (మిగతా 6వ పేజీలో..)



కేటీ రోడ్డులో చెత్తసేకరణ కేంద్రం వద్ద పారబోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



కఠినమైన చర్యలతోనే..

ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పర్యావరణం కోసం గ్రీన్ ఆర్మీ ద్వారా మొక్కలు అందజేసి.. వాటిని పెంచాలని కోరుతున్నాం. కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారే ప్లాస్టిక్ నిర్మూలన జరుగుతుంది. ఇది అందరి బాధ్యత.

- బి.గోపాల్, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు, కాశీబుగ్గ



అవగాహన కల్పిస్తాం

ప్లాస్టిక్ అమ్మకం షాపులపై నిరంతరం దాడులు కొనసాగిస్తాం. వాటి వినియోగంతో అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్వీయనియంత్రణ ద్వారే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చు. నిషేధజాబితాలో ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎస్.రామారావు, మున్సిపల్ కమిషనర్, పలాస-కాశీబుగ్గ

రేషన్ సకాలంలో అందించాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. గురువారం రేషన్ డీలర్లు, ఎండీపీ ఆపరేటర్లు, వేర్ హౌసింగ్ గొడౌన్ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశమయ్యారు. బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల మేనేజర్ టి.వేణుగోపాల్, జిల్లా అధికారి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆహారం, పోషణ భద్రత పథకంలో భాగంగా ప్రాసెసింగ్ యూనిట్లను రాయితీపై పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నూర్పుయంత్రం - 55యూనిట్లు, పప్పు మిల్లు - 1, మొక్కజొన్న డీహస్కర్స్ - 2, మొక్కజొన్న గింజలు వేరుచేసే యంత్రం -3, తృణధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలు - 5, నూర్పిడి యంత్రాలు- 15, తృణధాన్యాల పిండిమిల్లులు-20 యూనిట్లు మంజూరు చేయనున్నాం. వీటి సరఫరా కోసం ఆమోదం పొందిన కంపెనీలు, డీలర్లు కొటేషన్స్ అనుభవ పత్రాలను ఈ నెల 16లోగా జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలి. 19న జేసీ సమక్షంలో యూనిట్ల ధరలు నిర్ణయిస్తామ'ని ఆయన తెలిపారు.

సంతోషంగా.. సరదాగా ఉండాలంటూనే..

● హాస్టల్ భవనం పైనుంచి దూకి ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య
● మృతుడిది ప్రకాశం జిల్లా
● తల్లిదండ్రులు, స్నేహితుల్లో విషాదం

'జీవితం ఎప్పుడు ముగుస్తుందో.. ఎవరికీ తెలియదు. అందుకే ఎప్పుడూ సంతోషంగా.. సరదాగా ఉండాలి' అని తోటి స్నేహితులకు తరచూ చెప్పే ఆ విద్యార్థికి ఏమైందో.. అర్ధరాత్రి వేళ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎప్పుడూ చలాకీగా ఉండే ఆ విద్యార్థి.. కొన్నాళ్లుగా ముభావంగా ఉంటున్నాడు. మూడు రోజుల కిందట తన జీ మెయిల్ 'ది ఎండ్' అని రాసుకున్నాడు. నిజంగానే తన జీవితాన్ని అర్థాంతరంగా ముగించాడు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. కాగా.. ప్రేమ వైఫల్యమే ఈ ఘటనకు కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది.



ప్రవీణ్ నాయక్ (ఫైల్)



ట్రిపుల్ ఐటీలో ఘటనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ (ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం)లో సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రమావత్ ప్రవీణ్ నాయక్(19) ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి బాలుర హాస్టల్ భవనం మూడో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేళ్ల కిందట ఇదే క్యాంపస్‌కు చెందిన ఓ విద్యార్థిని తన హాస్టల్ గదిలో ఉరేసుకుంది. తాజాగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో.. క్యాంపస్‌లో విషాదం అలుముకుంది. ఎప్పుడూ చలాకీగా, అందరితో కలుపుగోలుగా ఉండే ప్రవీణ్‌నాయక్ ఇటీవల ముభావంగా ఉండేవాడని, ఎవరితోనూ కలిసేవాడు కాదని తోటి స్నేహితులు చెబుతున్నారు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడేవాడని తెలిపారు. జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదని, అందుకే సంతోషంగా, సరదాగా ఉండాలని తరచూ చెబుతుండేవాడని అంటున్నారు. ఇటీవల భోజనానికి పిలిచే సమయంలో.. తిండి కోసం ఎన్నాళ్లు ఉంటామంటూ నిరాశగా మాట్లాడాడని చెబుతున్నారు. మూడురోజుల కిందట తన జి-మెయిల్‌లో ది ఎండ్ అని రాసుకున్నాడని, ఇది ఇంత తీవ్రంగా ఉంటుందని ఊహించలేక పోయామని స్నేహితులు పేర్కొన్నారు.

అర్ధరాత్రి వేళ..

ప్రవీణ్‌నాయక్‌ది ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం. 2022-23 బ్యాచ్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరాడు. రెండేళ్లపాటు చిలకపాలెంలోని శివానీ క్యాంపస్‌లో పీయూసీ పూర్తిచేశాడు. ప్రస్తుతం సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరానికి ప్రమోట్ కావడంతో.. మూడు నెలల కిందటే ఎస్.ఎం.పురం కొండపై ఉన్న క్యాంపస్‌కు మార్చారు. ఈ క్రమంలో బాలురు హాస్టల్‌లో ఆరుగురు తోటి విద్యార్థులతో కలిసి మూడో అంతస్తులోని ఓ గదిలో ఉంటున్నాడు. గురువారం ఇంటర్నల్ ఎగ్జామ్ ఉండడంతో ప్రవీణ్ నాయక్ బుధవారం అర్ధరాత్రి 1.40గంటల సమయం వరకు మెలకువగా ఉండి.. ఆ సమయంలో మూత్ర విసర్జన కోసం వెళతానని స్నేహితులకు చెప్పి బయటకు వచ్చాడు. మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. అదే భవనంలో కింద అంతస్తులో నిద్రిస్తున్న విద్యార్థులు ఆ శబ్దాన్ని గమనించి బయటకు వచ్చి చూశారు. రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్ నాయక్‌ను గుర్తించారు. వెంటనే విధుల్లో ఉన్న సిబ్బందికి తెలియజేయగా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, పలువురు అధ్యాపకులు (మిగతా 6వ పేజీలో..)

న్యూస్ బాక్స్

బీల ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

● మానవహక్కుల కమిషన్‌ను కోరిన బీసీ సంక్షేమ ప్రతినిధులు

అరసవల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలంలోని బీల ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు సహకరించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.విజయభారతిని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఆమెను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. బీల ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం చేసిన రైతులపై పోలీసు కాల్పులు చేశారని, 723 మందిపై కేసులు పెట్టారని తెలిపారు. పదేళ్లుగా బాధితులు కోర్టు చుట్టూ తిరుగుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, హమీరుల్లా బేగ్, బద్రి సీతమ్మ యాదవ్ పాల్గొన్నారు.



విజయభారతికి వినతిపత్రం అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

ప్రకృతితో సాగుతున్నారు

● క్రిమిసంహారక మందులను అస్సలు వాడరు
● రసాయనిక ఎరువులనూ వినియోగించరు
● జిల్లాలో పెరుగుతున్న ఈతరహా వ్యవసాయం

● మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన పోలాకి తేజరావు అనే రైతు ఈ ఏడాది రెండు ఎకరాల్లో వంగ పంట వేశాడు. రసాయనిక ఎరువులు వేయడం మానేశారు. ప్రకృతిసిద్ధమైన ఎరువులను మాత్రమే వేస్తున్నారు. మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. అందులోనే జామ మొక్కలు నాటాడు. మూడు నెలలుకే కాపు వస్తుంది. వంగ ద్వారా 6 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.40 ఉండగా హోల్‌సేల్‌గా రూ.30కి అమ్ముతున్నారు. దీంతో వారానికి రూ.18 వేలు.. నెలకు రూ.1.25 లక్షల ఆదాయం వస్తోందని ఆ రైతు చెబుతున్నాడు. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉండడంతో తేజరావు సంబరపడుతున్నాడు. ఇంకా ప్రభుత్వం నుంచి రాయితీ వస్తే అంతర్ పంటలు వేసి ఆరోగ్యానికి హానికరం లేని కూరలు పండిస్తానని ఆ రైతు చెబుతున్నాడు.

● కొసమాళ గ్రామానికి చెందిన రైతు చౌదరి చంద్ర రావు ఈ ఏడాది 50 సెంట్ల భూమిలో టమోటా పంట వేశారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేస్తున్నాడు. పంటకు తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు వస్తుండడంతో ఇంకా సాగు విస్తీర్ణం పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నాడు. కూరగాయల సాగుతో పాటు వరి పంటను వేసినట్లు చెబుతున్నాడు. వీటిని కొంత సేంద్రియం, మరికొంత ప్రకృతి విధానంలో సాగు చేస్తుండడంతో మంచి లాభాలు వస్తున్నాయన్నారు.


మూడు నెలలకు కాపు కాసిన జామ


చాపర వద్ద వంగ సాగు..


ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రోజురోజుకూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువైంది. తద్వారా పెట్టుబడులూ అధికమవు తున్నారు. సాగు భారమై రైతులు అప్పులపాలై వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా పండించిన వాటిని తిన్న వారు సైతం జబ్బుల బారిన పడుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గిపోతుంది. అయితే దీనిపై చాలామంది రైతుల్లో అవగాహన లేదు. ఈ ప్రమాదం గుర్తించిన వారు మాత్రం ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. కషాయాలు, ఘన, ద్రవ, జీవామృతాలను వినియోగించి నేల సారాన్ని పెంచుతూ లాభదాయక సాగు దిశగా సాగుతున్నారు.

జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనంతగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 30 మండలాల పరిధిలోని 260 పంచాయతీల్లో 20 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, చెరకు, కొబ్బరి, కూరగాయలు, జీడిమామిడి వంటి పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

వదిలేసిన వైసీపీ ప్రభుత్వం..

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులను పట్టించుకోలేదు. దీంతో రైతులు ముందుకు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయనికి రూ.308.26 కోట్లు మంజూరు చేయటంతో ఈ తరహా సాగు మరింత ఊపందుకుంది. రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెట్ట రైతులకు మేలు..

మెట్ట భూముల్లో బోర్లు వేసుకుని ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకుంటే మంచి లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. అధికంగా మెళియాపుట్టి, నందిగాం, టెక్కలి, కొత్తూరు, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, పలాస, హిరమండలం, ఎల్ఎన్‌పేట, రణస్థలం, ఆమదాలవలస, ఎచ్చర్ల మండలాల్లో అధికంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలతో పాటు జామ, జీడి, మామిడి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు.


జీవామృతం తయారు చేస్తున్న తేజరావు

సొంతంగా తయారు చేసుకుని..

రైతులు సొంతంగానే జీవామృతం, వేపగింజల కషాయం, బ్రహ్మాస్త్రం వంటివి తయారు చేసుకుని పంటలపై పిచికారీ చేసుకుంటున్నారు. ప్రతి మూడు రోజులకు బెల్లం, పుట్టమట్టి, గోమూత్రం, గోమయం, శనగపిండి,ఎర్రీకంపోస్టు కలిపి కషాయం తయారుచేసుకుని పిచికారీ చేయటం వల్ల పురుగు చేరదని రైతులు చెబుతున్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక ఆదాయం పొందవచ్చని, అలాగే ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని అంటున్నారు.

అప్పులు తీరిపోతున్నాయి..

మొదట 10 సెంట్లలో వివిధ రకాల కూరగాయలు వేసి ప్రకృతిసాగు చేయడం వల్ల మంచి దిగుబడి వచ్చింది. దీంతో ఈఏడాది రెండు ఎకరాల మెట్టభూమిలో బోరు వేసుకుని వంగ పంట వేశాను. ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజలకు మంచి ఆహారం అందించేందుకు నావంతు కృషి చేస్తున్నాను. నెలకు ఖర్చులు పోయి రూ.75 వేలు మిగులుతుంది. పంటవేసి ఇప్పటికి ఆరు నెలలైంది. గతంలో వరి సాగు వల్ల ఏమీ మిగిలేది కాదు. వంగ మొక్కల్లోనే హైబ్రిడ్ జామ మొక్కలు వేసి మూడు నెలలకే కాపు రావటం ఆనందంగా ఉంది. ఇప్పుడు అప్పులు తీరిపోతున్నాయి.

-పోలాకి తేజరావు, చాపర

సాగుకు ముందుకు రావాలి..

ప్రకృతి వ్యవసాయం సాగు చేయటానికి రైతులు ముందుకు రావాలి. ప్రభుత్వం ఈ సాగు రైతులకు సహాయం చేస్తుంది. రైతులకు అవగాహన కల్పించి సాగు పెంచటానికి చర్యలు తీసుకుంటున్నాము.

- లింగాల మధుబాబు, ఏడీఏ


మొదటి మెట్టుపై కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేస్తున్న మహిళలు

సందడిగా పీర్లకొండ యాత్ర

● రెండో వారం పోటెత్తిన భక్తులు ● పీర్లస్వామికి మొక్కుల చెల్లింపు

ఇచ్ఛాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్లకొండ యాత్ర గురువారం సందడిగా జరిగింది. మార్గశిర మాసం రెండో గురువారం ఇచ్ఛాపురం చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పీర్లకొండ మొదటి మెట్టుపై కొబ్బరి కాయలు కొట్టి దీపారాధన చేశారు. అనంతరం కొండపైకి వెళ్లి పీర్లస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అటుకులు, బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించారు. అలాగే, కొండపై గల రెండు మందిరాల్లో పూజలు చేశారు. కందకంలోని నీటిని భక్తులంతా పవిత్ర తీర్థంగా స్వీకరించారు. ఈ నీటిని తీసుకునేందుకు పోటీ పడ్డారు.


కొండపై భక్తుల సందడి

భయంగొల్పేలా..

● టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం ● శిథిలావస్థకు చేరిన భవనం
● శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న వైనం ● ఆందోళనలో సిబ్బంది



టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం


పాకుదేరిన కార్యాలయం గోడలు


పెచ్చులూడుతున్న శ్లాబు


గోడలు పెచ్చులూడిన దృశ్యం

టెక్కలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 1950లో అప్పటి బ్రిటీష్ పాలకులు ఈ కార్యాలయాన్ని నిర్మించారు. నాటి నుంచి డివిజన్ పాలనా వ్యవహారాలను సబ్‌కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సంతబొమ్మాళి, టెక్కలి, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, కొత్తూరు, సారవకోట, హిరమండలం, పాతపట్నం, ఎల్ఎన్‌పేట మండలాలను కలుపుతూ డివిజన్ కార్యాలయంగా కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ కార్యాలయం గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. పాకుపట్టిన గోడలు, నాశిరకం గచ్చులు, శిథిలమైన గోడలు సిబ్బందికి ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్య పరిపాలనా అధికారి గది, కేఆర్‌సీ తహసీల్దార్, డేటాఎంట్రీ ఆపరేటర్లు, డివిజన్ గణాంక, సర్వే అధికారులు ఉండే గది, మెయిన్ హాల్‌లో శ్లాబ్‌కు పెచ్చులూడాయి. కొత్త కార్యాలయం కోసం ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్లు ప్రతిపాదనలు పెట్టడం, తరువాత మరమ్మతులు చేపట్టడం పరిపాటిగా మారింది. వర్షం పడితే చాలు గతంలో రికార్డులు తడిసి ముద్దయ్యేవి. పాత శ్లాబుపై అక్కడక్కడా ప్యాచ్‌వర్కులు చేయడంతో ప్రస్తుతం ఇబ్బందులు తొలగాయి. కార్యాలయంలో ఆర్డీవో గది, సమావేశ మందిరం మినహా మిగిలినవన్నీ పురాతనంగానే కనిపిస్తున్నాయి. 1994లో టెక్కలి ఎమ్మెల్యేగా గెలిచిన ఎన్టీ రామారావు సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట నిర్మాణానికి ప్రతిపాదన చేసినా అది కార్యరూపం దాల్చలేదు. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వివరణ కోరగా.. భవనం మరమ్మతుల కోసం ఆర్‌అండ్‌బీ అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు.

డేంజర్.. డేంజర్

(ఐదో పేజీ తరువాయి)

ఎక్కువగా ఉన్నాయి. అలాగే ప్లాస్టిక్ వస్తువులు మట్టిలో కలిసిపోవడానికి కనీసం వందల సంవత్సరాల సమయం పడుతుంది. దీనివల్ల నేలసాంద్రత తగ్గి పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతోంది.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవీ..

ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అనేకం ఉన్నాయి. కాగితం, నార, వెదురుతో తయారుచేసిన వస్తువులు వినియోగిస్తే ప్లాస్టిక్ వినియోగం తగ్గించవచ్చు. ప్లాస్టిక్ సీసాలకు బదులు గాజు, పింగాణి, మట్టితో తయారు చేసిన వస్తువులు వినియోగించాలి. కానీ చాలా మంది విక్రయదారులు, వినియోగదారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.

నిషేధిత జాబితాలో ఉన్న ప్లాస్టిక్..

థర్మోకోల్ షీట్లు, ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు, ప్లాస్టిక్ జెండాలు, వంద మైక్రాన్ల లోపు ఉన్న పీవీసీ బ్యానర్లు, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డులు, స్ట్రాలు, ఫోర్కులు, బెలూన్లుకు వినియోగించే ప్లాస్టిక్ పుల్లలు, కొబ్బరిబొండాలకు వినియోగించే ప్లాస్టిక్ స్ట్రాలు, ఐస్‌పుల్లలు, లాలీపాప్‌కు ఉండే పుల్లలు ఇవన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. కానీ వీటి వినియోగం మాత్రం పెరగడం.. కలవరపరుస్తోంది.

సంతోషంగా.. సరదాగా ఉండాలంటూనే..

(ఐదో పేజీ తరువాయి)

సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌తో శ్రీకాకుళం సర్వజనా సుపత్రికి హుటాహుటిన తరలించగా ప్రవీణ్ నాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

● మృతుడి తల్లిదండ్రులు రవీంద్రనాయక్, విజయాభాయి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారుల్లో ప్రవీణ్ నాయక్ మొదటి సంతానం. రెండో కుమారుడు ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ-1 చదువుతున్నాడు. మూడో కుమారుడు అదే గ్రామంలోనే పదో తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతి వార్త తెలిసి వారు విషాదంలో మునిగి పోయారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, తహసీల్దార్ సింహాచలం తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎమ్మెల్యే సందర్శన..

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఉదయం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. సంఘటన స్థలాన్ని, విద్యార్థి ఉన్న హాస్టల్ గదిని పరిశీలించారు. విద్యార్థి దూకిన చోట కిటికీ లేకపోవడాన్ని చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయాన్ని విద్యాశాఖా మంత్రి లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్తున్నట్టు చెప్పారు. ఈయనతో పాటు టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ సీనియర్ నేత సంపతిరావు నాగేశ్వరరావు, సంధ్యా గజపతి ఉన్నారు.

పెద్దపీఆర్ సీతాండలో విషాదఛాయలు..

● విద్యార్థి మృతి ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

పుల్లలచెరువు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని పెద్ద పీఆర్‌సీతాండకు చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌కుమార్ నాయక్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ట్రిపుల్ ఐటీ నుంచి అధికారి గురువారం ఉదయం తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రవీణ్ మృతదేహం కోసం తల్లిదండ్రులు, బంధువులు శ్రీకాకుళానికి పయనమయ్యారు. ప్రవీణ్‌కుమార్ చదువులో చురుగ్గా ఉండేవాడు. పదవ తరగతిలో జిల్లాస్థాయిలో ర్యాంకు సాధించడంతో ట్రిపుల్‌ఐటీలో సీటు దక్కించుకున్నాడు. ప్రవీణ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, దీని వెనుక బలమైన కారణాలు ఉండి ఉంటాయని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు.

ప్రేమ వైఫల్యమే కారణం

● డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్ నాయక్ ఆత్మహత్యకు.. ప్రేమ వైఫల్యమే కారణమని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. గురువారం సాయంత్రం శ్రీకాకుళంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్య ఘటనపై నైట్‌వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ ఎం.అవతారం విచారణ చేపట్టారు. ప్రవీణ్.. కళాశాలలోని ఓ అమ్మాయిని ప్రేమించాడని, ఆ విషయం ఆమెకు చెప్పగా తిరస్కరించడం మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. హాస్టల్‌లో తోటి విద్యార్థుల దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావించాడు. తల్లిదండ్రులతోపాటు, కళాశాలల్లో విద్యార్థులను కూడా విచారిస్తున్నాం. ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్‌లో సమాచారం సేకరిస్తున్నాం. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ఇకపై కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామ'ని తెలిపారు. సమావేశంలో రణస్థలం సీఐ ఎం.అవతారం తదితరులు పాల్గొన్నారు.

అడవిలో అలజడి

(ఐదో పేజీ తరువాయి)

నిత్యం అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు తరలి వస్తున్నాయి. అటవీప్రాంతంలో నీరులేక విలవిల్లాడుతూ.. గ్రామాల్లోకి వచ్చి వేటగాళ్ల ఉచ్చులో పడి మృత్యువాత పడుతున్నాయి. అరుదైన కొండచిలువలు, వైరల్‌నాగులు సైతం జనావాసాల్లోకి వచ్చి హతమవుతున్నాయి. వీటిని నివారించేందుకు అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారే తప్ప ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● బుల్లెట్ దిగని శరీరం.. అయినా..

అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైన అలుగు (పంగోలిన్)నూ వేటగాళ్లు వదలడం లేదు. అలుగును ఏ జంతువు చంపలేదు. తినలేదు. చిన్న అలికిడి వినిపించినా బంతి ఆకారంలో ముడుచుకుపోయే క్షీర జాతికి చెందిన జీవి ఇది. చీమలు, చెదపురుగులు తిని జీవిస్తుంది. తుపాకీతో కాల్చినా బుల్లెట్ లోపలకి దిగనంత కఠినంగా ఉండే శరీర నిర్మాణం దీని ప్రత్యేకత. ఇటువంటి జీవి వేటగాళ్లకు మాత్రం సులభంగా దొరికి పోతోంది. కాశీబుగ్గ అటవీ రేంజ్ పరిధిలో అలుగు అక్రమ రవాణాపై అనేక కేసులు నమోదు కావటం గమనార్హం. చైనా, వియత్నాం దేశాల్లో అలుగుకు డిమాండ్ ఎక్కువ. ఈ జంతువు చర్మం, పొలుసు, మాంసంలో ఔషధ గుణాలున్నాయని నమ్ముతారు. ఖరీదైన వస్త్రాలు ఆభరణాల్లోనూ వీటిని వినియోగిస్తారు. ఇదే అదునుగా వేటగాళ్లు అలుగును అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.


ఇటీవల పలాసలో పోలీసులు స్వాధీనం చేసుకున్న అలుగు

ప్రకృతిని కాపాడుకోవాలి..

ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. మన ప్రకృతిని మనమే కాపాడుకోవాలి. ప్రకృతిని నాశనం చేస్తే.. పర్యవసానం తీవ్రంగా ఉంటుంది. కొండలు, చెట్లు లేక అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు జనసంచారంలో తిరుగుతుంటే మనిషి ప్రాణాలకే ప్రమాదం. ఇటీవల ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరించి తీవ్ర ఆందోళన కలిగించాయి. ఇప్పటికీ జిల్లాలోనే సంచరిస్తున్నాయి. జింకలు, కణుజులు, చెవులపిల్లులు వంటివి పూర్తిగా కనుమరుగవుతున్నాయి. వీటిని వేటాడితే కఠినచర్యలు తప్పవు.

-మురళీకృష్ణంనాయుడు, రేంజి అధికారి, కాశీబుగ్గ

వామ్మో ట్రాఫిక్

ఇచ్ఛాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి రైల్వే ఎల్‌సీ గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గురువారం పీర్లకొండ యాత్ర కావడంతో ఈ గేటు మీదుగా వందలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించారు. సాయంత్రం 5 గంటల సమయంలో రైలు రావడంతో గేటు పడింది. అదే సమయంలో కొండయాత్రకు వెళ్లి ప్రజలు రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. సుమారుగా అరగంట సేపు వాహనాలు నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

అధికారులూ ఇంత నిర్లక్ష్యమా?

● పూర్తిగా కోతకు గురైన సింగూరు రోడ్డు

పొందూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం సింగూరు రోడ్డు పాలిట శాపంగా మారింది. మూడు నెలల కిందట వరదలతో ఈ రోడ్డు కొద్దిగా కోతకు గురైంది. పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తరువాత పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి దుస్థితిని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి టీడీపీ నాయకులు జగన్మోహన్‌రావు, గణపతి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పీఆర్ డీఈ చంద్రశేఖర్ గురువారం ఈ రోడ్డును పరిశీలించారు. తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని నాయకులతో పాటు గ్రామస్థులు అధికారులను కోరారు.


పూర్తిగా కోతకు గురైన రోడ్డు

ఇంజనీరింగ్ కార్మికుల పోరాటం ఆగదు


నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళంఅర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచి, వారి సమస్యలు పరిష్కరించే వరకూ తమ పోరాటం ఆగదని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు శ్యామలరావు, కార్యదర్శి సంతోష్ అన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆరో రోజు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 జీతం ఇవ్వాలని, రిటైర్మెంట్ సదుపాయం కింద రూ.10లక్షలు ఇవ్వాలని, విధి నిర్వాహణలో చనిపోయిన కార్మిక కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్ల సర్వీస్ పూర్తయిన వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, సతీష్, అర్జున్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి


ఐసీడీఎస్ పీడీ కార్యాలయ అధికారి రామారావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

అరసవల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధతో కలిసి ఐసీడీఎస్ పీడీ కార్యాలయ అధికారి కె.రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె ఒప్పందంలో భాగంగా అంగీకరించిన అంశాలను అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు పి.లత, పి.భూలక్ష్మి, కేవీ హేమలత, పి.పద్మాలత, ఎస్.శ్రీదేవి, జ్యోతి, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ తాగునీరు అందిస్తాం

శ్రీకాకుళంఅర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలందరికీ తాగునీరు అందించడమే లక్ష్యమని నగరపాలక కమిషనర్ పీవీవీ ప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన గొంటి వీధి, సీహెచ్‌ఎస్‌ఎన్ కాలనీ, దండి వీధి, శాంతమ్మ కాలనీతో పాటు వివిధ పార్కులను పరిశీలించారు. నగర సుందరీకరణలో భాగంగా పార్కులు అభివృద్ధి చేసి, చిన్నారులు ఆడకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

ఆదిత్యుని సన్నిధిలో
మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్

అరసవల్లి/గార, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సాయని కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆమెకు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ అందజేశారు. అలాగే, శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుని కూడా దర్శించుకున్నారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని ఈవో గురునాథ్‌రావు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగీశ్వరరావు తెలిపారు. 11 కేవీ ఎచ్చెర్ల మండల హెడ్‌క్వార్టర్స్ ఫీడర్, ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్ షిప్, ఎస్ఎంపురానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

జి.సిగడాం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా రీజనల్ కార్పొరేట్ అధికారి డి.మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతుల రుణాలు, చెల్లింపుల రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన సేకరించి సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట పర్సనల్ ఇన్‌చార్జి జానకిరామ్, సీఈవో చిన్నారావు, సిబ్బంది ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆమదాలవలస అర్బన్, రూరల్, సరుబుజ్జిలి, పొందూరు మండలాల ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో మండలాల్లోని అన్ని టీసీలను గెలుపొంది సాగునీటి అధ్యక్షులను గెలిపించుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న సేవలను వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు గొండు రమణ, చేపేన సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పురపాలక సంఘంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం నూతన ఫాగింగ్ యంత్రాలు, స్ప్రేయర్లను ప్రారంభించారు. ప్రతి వార్డునూ పరిశుభ్రంగా ఉంచేందుకు, దోమల నివారణ కోసం రెండు ఫాగింగ్ మిషన్లు, ఏడు స్ప్రేయర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మేనేజర్ బిసాయి, పీవీవీకే రాజు, చక్రవర్తి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

జిల్లా వాసులకు
గద్దర్ పురస్కారం

శ్రీకాకుళం అర్బన్/టెక్కలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు ప్రజాయుద్ధ నౌక గద్దర్ జాతీయ సేవా పురస్కారం లభించింది. ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం రాష్ట్ర నాయకుడు కంఠ వేణు, గిరిజన సంఘ నాయకుడు వాబ యోగి ఈ అవార్డును అందుకున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా గన్నవరంలో మమతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గద్దర్ కుమార్తె, తెలంగాణ ప్రభుత్వ సారధి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా వారు ఈ అవార్డును అందుకున్నారు. వారికి దళిత జేఏసీ నాయకులు ఉదయ్ భాస్కర్, కళ్లేపల్లి రాంగోపాల్, తైక్వాండో శ్రీను, యజ్జల గురుమూర్తి, జి.అ ప్పారావు, కామరాజు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా రేషన్ కార్డులు, పింఛన్ మంజూరు చేయాలని, కాలువలు, రోడ్లు నిర్మించాలని అధిక వినతులు వచ్చాయి. అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ఈ వినతుల వెల్లువకు కారణమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలిపారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రైతు ఉద్యమాన్ని
విజయవంతం చేయండి

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శుక్రవారం నిర్వహిం చే రైతు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులు, రైతులు మడపాం టోల్ ప్లాజా వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పొన్నాడ బ్రిడ్జి వద్ద ఉన్న జ్యోతిరావు పూలే పార్కుకు వెళ్లనున్నట్లు చెప్పారు. 10 గంటలకు సమావేశం అనంతరం, 11 గంటలకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

కుమారుడి చితికి నిప్పంటించిన తల్లి


కుమారుడి అంత్యక్రియలు నిర్వహిస్తున్న తల్లి రమ

ఇచ్ఛాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుమారుడి చితికి తల్లి నిప్పంటించిన ఘటన ఇచ్ఛాపురంలో గురువారం చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్ చక్రపాణి వీధికి చెందిన లక్ష్మీరెడ్డి రాజు (33) అనే వ్యక్తి నాలుగేళ్లుగా చికెన్ సెంటర్ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఆయనకు తల్లి రమ, భార్య రోజా, పిల్లలు సిరి(11), ఓంకార్(5) ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజు మృతి చెందాడు. పిల్లలు చిన్నవారు కావడంతో, తల్లి రమ కొడుకు చితికి నిప్పంటించి దహన సంస్కారాలు పూర్తి చేసింది. ఇంటికి ఆధారంగా ఉన్న రాజు మృతితో ఆ కుటుంబం తల్లడిల్లిపోతుంది.

దాడి ఘటనపై మరోసారి విచారణ


విచారణ చేపడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

పొందూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తోలాపి సచివాలయంలో వీఆర్వో ఎం.దివాకర్ (రేవతిరావు)పై ఓ వ్యక్తి దాడి చేసి కంప్యూటర్లు ధ్వంసం చేసిన ఘటనపై జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంపీడీవో ఎం.మన్మథరావు విచారణ చేపట్టిన నివేదికను కలెక్టర్‌కు అందించారు. దీనిపై సంతృప్తి చెందని కలెక్టర్ మరోసారి సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జడ్పీ సీఈవోని ఆదేశించారు. దీంతో వీఆర్వో, సచివాలయ సిబ్బంది సమక్షంలో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ విచారణలో తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంపీడీవో మన్మథరావు, సచివాలయ కార్యదర్శి వినోద్ ఉన్నారు.

'స్వర్ణాంధ్ర విజన్'కు జిల్లా ఉద్యోగులు


బస్సులను ప్రారంభిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గురువారం బస్సుల్లో బయలుదేరారు. ఈ బస్సులను జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీవో ప్రసన్నలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో ప్రయోజనం

సరుబుజ్జిలి /బూర్జ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలతో ఎంతో ప్రయోజనం కలగనుందని డీఎల్‌పీవో టీవీ రమణారావు పేర్కొన్నారు. బూర్జలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పల్లెల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను ఒక చోట చేర్చి, స్వచ్ఛతను పెంపొందించడమే కాకుండా దానిని సేంద్రియ ఎరువుగా మార్చేందుకు ఈ కేంద్రాలను నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు, ఈవోఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ కిరణ్ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

గార డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం, గార మండలాల పరిధిలోని 18 సాగు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించను న్నట్లు జలవనరులు శాఖ డిప్యూటీ ఈఈ కేవీ క్రాంతి కుమార్ తెలిపారు. గురువారం ఆయన గారలో విలేకర్లతో మాట్లాడారు. నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి

అరసవల్లి, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్య చేసుకోవడంపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు విచారం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం, జిల్లా యంత్రాంగంతో గురువారం ఆయన మాట్లాడారు. విద్యార్థి మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని కోరారు.

మాదకద్రవ్యాల జోలికిపోవద్దు

సోంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉన్నతస్థానాలకు చేరుకుంటారని ఎస్ఐ లవరాజు అన్నారు. స్థానిక మహర్షి విద్యానికేతన్‌లో గురువారం మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వియల్ శకుంతల, కన్నా, తరిప్రసాద్ పండా పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర ఐటీఐలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కరస్పాండెంట్ కూన భానోజీరావు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళాలో
సిక్కోలు ఉత్పత్తులు

ఆమదాలవలస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో వ్యవసాయశాఖ గురువారం నుంచి నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో జిల్లాకు చెందిన పలు ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించారు. నిమ్మతొర్లవాడ బెల్లం, బూర్జ చిరుధాన్యాలు, పప్పు దినుసులు, తదితర ఉత్పత్తులను స్టాళ్లలో పెట్టినట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి తెలిపారు. ఈ నెల 15 వరకు మేళా జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ, మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, శోభన్, చిన్నమ్మడు, చిరంజీవి, జగన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమంగా ఇసుక తరలింపు

● 10 ట్రాక్టర్ల పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఎచ్చెర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ్మినాయుడుపేట సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 ట్రాక్టర్లను పోలీసులు గురువారం పట్టుకున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి వీటిని పట్టుకున్నారు. ట్రాక్టర్లను ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై తహసీల్దార్ సింహాచలం మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే తవ్వకాలు..

తమ్మినాయుడుపేట సమీపంలోని నాగావళి నది వద్ద ఎలాంటి అనుమతులు లేకుండానే కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నదిపై బ్రిడ్జితోపాటు శ్రీకాకుళం నగరానికి తాగునీరు సరఫరా చేసే బావులు ఉన్నా పట్టించుకోవడం లేదు. పగటి పూట తవ్వకాలు జరిపి పరిసర ప్రాంతాల్లో నిల్వచేసి రాత్రివేళల్లో లారీలకు లోడ్ చేసి విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలిస్తూ దోచుకుంటున్నారు. దీనిపై స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు స్పందించి ఇసుకాసురులకు కళ్లెం వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.

రక్షణ గోడ కూల్చివేతపై వివాదం

● పోలీసుల విచారణ


రక్షణ గోడ కూల్చివేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాడు గ్రామంలో రక్షణ గోడ కూల్చివేతపై వివాదం నెలకొంది. గ్రామంలో వాటర్ ట్యాంకుకు ఆనుకుని ఉన్న స్థలాన్ని గతంలో అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఆ స్థలం ప్రభుత్వానిదని అధికారులు తేల్చారు. దీంతో గ్రామ యువత ఆ స్థలంలో వ్యాయామశాల ఏర్పాటు చేసుకున్నారు. అయితే, కొన్ని రోజుల కిందట ఆ స్థలం తనది అంటూ మరో వ్యక్తి వచ్చి దాని చుట్టూ రక్షణ గోడ నిర్మించాడు. గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు వ్యాయామశాల సామాన్లను బయటపడేసి, రక్షణ గోడను కూల్చివేశారు. దీంతో పెద్దపాడులో గందరగోళం నెలకొంది. ఈ భూ వివాదంపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

బైక్ గ్యారేజ్‌లో భారీ అగ్ని ప్రమాదం


మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలకొండ మార్గంలో పైల భాస్కరరావుకు చెందిన మెకానిక్ గ్యారేజీలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రిపేర్ కోసం వచ్చిన 15 ద్విచక్ర వాహనాలు, కర్రలు కోసే మిషన్లు, నూతన స్ప్రేయర్లు, ఆటో మొబైల్స్ సామగ్రి, బ్యాటరీలు, ఇంజన్ ఆయిల్ అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.16 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు యజమాని తెలిపారు. తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరగ్గా స్థానికులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచార మిచ్చారు. వారు వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు ఫైర్ ఆఫీసర్ బుచ్చోడు తెలిపారు.

ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం

పాతపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిడ్డిమి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ గురువారం పట్టుబడినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. నిందితుడి నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదేచేశామన్నారు. కాగా ఈతడు గతంలో కూడా మద్యం తరలింపు కేసులో నిందితుడిగా ఉన్నందున రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పారిశ్రామికవేత్త రాజేశ్వరరావు మృతి


రాజేశ్వరరావు (ఫైల్)

టెక్కలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం తలగాం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త హనుమంతు రాజేశ్వరరావు (82) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గురువారం విశాఖ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయన కాకినాడలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి నాగార్జున యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. ఆ తరువాత కర్ణాటక రాష్ట్రం హుబ్లీలో పరిశ్రమలు నెలకొల్పారు. పలు పవర్ ప్రాజెక్టుల కన్సల్టెంట్‌గా, జోష్వా సాల్ట్, హేమాద్రి సిమెంట్స్ తదితర పరిశ్రమల్లో డైరెక్టర్‌గా వ్యవహరించారు. విజయవాడలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలున్నారు. రాజేశ్వరరావు పార్థివ దేహాన్ని విశాఖ నుంచి విజయవాడ తరలించి శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజేశ్వరరావు మృతితో తలగాంలో విషాదఛాయలు అలముకున్నాయి. పారిశ్రామికవేత్త రాజేశ్వరరావు మృతి తీరని లోటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, తలగాం గ్రామానికి చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు హనుమంతు వెంకటేశ్వరరావు, హనుమంతు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్..


చైతన్య (ఫైల్)

నందిగాం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం కాపుతెంబూరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా ఉంటున్న చైతన్య (30) రోడ్డు ప్రమాదానికి గురై విశాఖలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని షేక్ మహ్మద్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాత్రునివలసకు చెందిన చైతన్యం మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని స్వగ్రామం ద్విచక్ర వాహనంపై వెళ్తూ కాపు తెంబూరు జంక్షన్‌లో హైవేపై ప్రమాదానికి గురై తీవ్ర గాయాల బారిన పడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి బుధవారం సాయంత్రం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. చైతన్య భార్య అమృతవర్షిణి గురువారం నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహానికి విశాఖ కేజీహెచ్‌లో పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. చైతన్యకు తల్లిదండ్రులు, రెండున్నరేళ్ల కుమార్తె, సోదరుడు చాణిక్య ఉన్నారు. చైతన్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చైతన్య మృతిపై ఎంపీడీవో టి.రాజారావు, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్‌కుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్లపై తిష్ఠ.. ప్రజలకు అవస్థ

హిరమండలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలోని ప్రధాన రహదారిపై నిత్యం పశువులు ఇలా ఇష్టానుసారంగా సంచరించడంతోపాటు తిష్ఠ వేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలకు అడ్డుగా రావడం వంటి ఘటనలు కోకొల్లలు.. పశువుల యజమానులు వాటిని రోడ్లపై విడిచిపెడుతుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. వీటిని నియంత్రిం చాల్సిన పంచాయతీ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఒక్కో సమయంలో కొన్ని పశువులు వాహనదారులను సైతం వెంబడిస్తుండడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.


ప్రధాన రహదారిపై ఉన్న పశువులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● యువతకు ఎమ్మెల్యే బగ్గు పిలుపు

నరసన్నపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. యువత స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, ఎంపీడీవో మధుసూదనరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, టీడీపీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, ఏబీవీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సాగు సంఘాల ఎన్నికల్లో విజయం సాధించాలి

పోలాకి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 14న జరగనున్న సాగునీటిసంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులు విజయం సాధించేలా సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన బీజేపీ నుంచి కార్యకర్తలు ఎన్నికల్లో పోటీ చేసి విజయంసాధించాలన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి పార్టీ మద్దతుదారులు పోటీలో నిలబడి విజయం సాధించాలన్నారు.

తీరంలో తాబేళ్లు మృత్యువాత



వజ్రపుకొత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో పదుల సంఖ్యలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ప్రతి ఏటా నవంబరు, డిసెంబరుల్లో తీరంలో గుడ్లు పెట్టేందుకు తాబేళ్లు తీరానికి వస్తుంటాయి. ఇసుక తిన్నెలలో గోతులు తవ్వి గుడ్లు పెట్టి మరలా సముద్రంలోకి వెళ్లి పోతాయి. ఆ సమయంలో సముద్రపు ఒడ్డున ఉండే కుక్కలు, నక్కలు ఎలుగు బంట్లు ఇతర జంతువులు తాబేళ్లపై దాడిచేసి మృత్యువాతకు గురిచేస్తుంటాయి. దీంతో దుర్గంధం వెదజల్లి పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరుదైన సముద్ర జీవులలో ఒకటైన తాబేళ్లు మృత్యువాత పడుతుండడంపై పర్యావరణ, జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకార మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ

సంతబొమ్మాళి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు గ్రీన్ క్లైమాట్ ఫండ్, యూఎన్‌డీపీ సౌజన్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు పలాస మత్స్యశాఖ సహాయ సంచాలకుడు వై.సత్యనారాయణ అన్నారు. గురువారం వడ్డితాండ్ర శ్రీజగన్నాథమత్స్య పారిశ్రామిక సహకార సంఘంలోని మహిళలకు ఆర్నమెంట్ ఫిషెష్ పెంచేందుకు అవగాహన కలిగించారు. అనంతరం ఆకాశలక్కువరం కట్టు సందర్శించి స్వదేశీ మత్స్యకారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యుడు సుబ్బారావు, శ్యామ్యూల్, టెక్కలి ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో, స్వదేశీ మత్స్యకార సంఘ అధ్యక్షుడు నాగేశ్వరి పద్మనాభం పాల్గొన్నారు.

లీజు మంజూరు అన్యాయం



కొత్తూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నివగాం గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం 1995లో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అధికారులు లీజు మంజూరు చేయడం అన్యాయమని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు శిర్లప్రసాద్ అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దు గ్రామంలో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా చేయడం దారుణమన్నారు. ప్రతి రోజూ ప్రయాణికులు వేచి ఉండే కాంపెక్స్‌ను పదేళ్లకు లీజుకు ఇవ్వడాన్ని ఉపసంహరించాలన్నారు. ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, చిన్నారావు పాల్గొన్నారు.

పశుగణన లక్ష్యాలను సాధించాలి

పలాస/మందస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న పశు గణన లక్ష్యాలను పూర్తి చేయాలని, గణనలో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ జేడీ మురళీధర్ అన్నారు. పలాస, మందస మండలాల్లో పశుగణనను గురువారం పరిశీలించారు. కొత్తగా నిర్మించిన గోకులం షెడ్లను, పశువైద్య కేంద్రాలను సందర్శించారు. జిల్లా పశుగణన పర్యవేక్షణాధికారి జి.నారాయణరావు, పలాస ఏడీ పి.చంద్రశేఖర్, పశు వైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

మెళియాపుట్టి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీ డీవో ప్రసాద్ పండా అన్నారు. గురువారం నడసందర గ్రామంలోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తయారుచేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెత్త ద్వారా సంపద సృష్టించుకుంటే పంచాయతీ లకు అదనపు ఆదాయం వస్తుందన్నారు.

ఆ ఫిర్యాదులు ఎవరివి?

● విచారణకు హాజరు కాని ఫిర్యాదుదారులు
● ఇప్పటికే రెండు పర్యాయాలు ఎంక్వైరీలు
● 'ఆంధ్రజ్యోతి' కథనంతో బయటపడుతున్న వైనం

మెళియాపుట్టి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఐసీడీఎస్‌లో గత కొంతకాలంలో సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళుతుండడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఏం జరుగుతోంది' శీర్షికతో వచ్చిన కథనానికి సిబ్బందిలో గుబులు నెలకొంది. ఈ కథనంతో అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. సారవకోట ప్రాజెక్టులో ఇంతవరకు ఉన్న పాతపట్నం, మెళియాపుట్టి మండలాలను వైసీపీ ప్రభుత్వంలో విభజించి పాతపట్నం కేంద్రంగా మెళియాపుట్టిని చేర్చి కొత్తగా ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. సీడీపీవో ఇన్‌చార్జిగా విమలారాణిని నియమించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇటీవల అధి కారుల బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. కొందరు సిబ్బంది విమలారాణిని బదిలీ చేయించి తమకు అనుకూలమైన వ్యక్తిని సీడీపీవోగా తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు సక్రమంగా పని చేస్తుండడంతో ఆమెను కొనసాగించారు. దీంతో ఆకాశరామన్న లేఖల రూపంలో ఫిర్యాదులు చేస్తుడడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు సిబ్బంది సీఎంవో కార్యాలయానికి కేటీఆర్ పేరుతో ఫిర్యాదులు చేసి తీరా దర్యాప్తునకు అధికారులు వచ్చినప్పుడు హాజరుకావడం లేదు. దీంతో తొలిసారి ఐసీడీఎస్ పీడీ విచారణ చేపట్టి రిపోర్టు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే మరలా ఫిర్యాదులు చేయడంతో ఈ పర్యాయం విశాఖపట్నం ఆర్జేడీ పాతపట్నం వచ్చి అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల నుంచి 11 అంశాలపై రాతపూర్వకంగా అభిప్రాయాలను తీసుకున్నారు. కేటీఆర్ పేరుతో వచ్చిన ఫిర్యాదులపై తప్పుడు చిరునామాలున్నట్లు అధికారులు గుర్తించారు. పాత పట్నం మండల కేంద్రానికి చెందిన కొందరు వైసీపీ నాయకులే సీడీపీవో కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు సిబ్బందితో కలిసి ఇటువంటి ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం. పీవో సెలవులు ఇవ్వకపోవడం, తరచూ అంగన్‌వాడీ కేంద్రాలకు తనిఖీలకు వెళుతుండడంతో కొందరు సిబ్బంది ఇలా ఫిర్యాదులు చేస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇది కాకుండా పీవో సిబ్బంది నుంచి వసూళ్లకు పాల్పడడం వల్ల కూడా ఫిర్యాదులు వెళుతున్నట్లు మరో వార్త కూడా ప్రచారంలో ఉంది. ఏది ఏమైనా పాత పట్నం ఐసీడీఎస్ కార్యాలయంలో కొంతకాలంగా విచారణలు జరుగుతుండడం చర్చనీయాంశమవుతోంది. అయితే ఆర్జేడీ సీఎంవో కార్యాలయానికి ఇచ్చే నివేదికలను బట్టి చర్యలు ఉండే అవకాశాలు కనిపిస్తున్నట్లు కొందరు సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

రైల్వే కార్మిక సంఘ ఎన్నికల్లో శ్రామిక్ కాంగ్రెస్ ఘన విజయం

● పలాసలో సంబరాలు చేసిన కార్మికులు

పలాస, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌కోస్ట్ రైల్వే కార్మిక సంఘ ఎన్నికల్లో శ్రామిక్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఖుర్దారోడ్, విశాఖపట్నం, సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో వారం రోజుల కిందట ఎన్నికలు జరిగాయి. శ్రామిక్ కాంగ్రెస్‌కు 53.07 శాతం ఓట్లు రాగా, శ్రామిక్ యూనియన్‌కు 37.73 శాతం, ఎంప్లాయీస్ యూనియన్‌కు కేవలం 2.12 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా రమేష్ చంద్రసాహు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఖుర్దారోడ్, పలాసలో ఆ సంఘ నాయకులు గురువారం రాత్రి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కార్మికుల విజయమని, వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు, రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించేందుకు, క్లాస్-4 కార్మికుల సమస్యలపై పోరాటం, కొత్త ఉద్యోగ నియమకాలపై కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. పార్టీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు వి.రామారావు, కార్యదర్శి రవి చౌదరి, ఎస్ఎఫ్ఐఆర్ సభ్యుడు ఎస్.రాజశేఖర్, కమ్మినాన హరి తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న రైల్వే కార్మికులు, మాట్లాడుతున్న రమేష్ చంద్ర సాహు

బలవంతపు భూ సేకరణ నిలిపివేయాలి

హరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి బలవంతపు భూసేకరణను నిలిపి వేయాలని వామ పక్ష నేతలు డి.గోవిందరావు, చాపర వేణు డిమాండ్ చేశారు. మందస మండలం రాంపురం, గంగు వాడ, బేతాళ పురం, బిడిమి తదితర గ్రామాల్లో గురువారం ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కార్పొరేట్ శక్తుల కోసం ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారని, దీనికి నిరుపేదల భూములను బలవంతం గా లాక్కుంటు న్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఎయిర్‌పోర్టు పనులు నిలిపివేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొమర వాసు, బత్తిన లక్ష్మణ్, మాధవరావు, సన్యాసిరావు, కుసుమ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



రాంపురంలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

చలో విజయవాడకు టీడీపీ శ్రేణులు

పాతపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వ హించనున్న విజన్ స్వర్ణాంధ్ర-2027 కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం టీడీపీ శ్రేణులు తరలి వెళ్లాయి. ఈ వాహనాలకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జెండా ఊపి ప్రారంభించారు. పాత పట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు.


వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో గాంధీనగర్, సంతపేట, పీఎన్‌కాలనీ, దేశవానిపేట, శివనగర్ కాలనీ, వజ్రంపేట, పసారువీధి, ఆదివారంపేట, నక్కవీధి, వీరన్నాయుడు కాలనీ, బొంతల వీధి, తిరుమలవీధి, సత్యనారాయణ కాలనీ, కామేశ్వరినగర్, బొరిగివలస, ఈదులవలస జంక్షన్, నేతాజీ వీధి, కొత్తవీధి, నాయుడు వీధి, చిత్రవీధి, భవానీపురం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇండస్ట్రీ ఫీడర్‌కు..

నందిగాం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నందిగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్‌కు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టుకొమ్మల తొలగింపు, మరమ్మతుల దృష్ట్యా పెద్దతామరాపల్లి, గొల్లూరు, దిమిలాడ, బూరగాం, శాసనాం గ్రానైట్ పరిశ్రమతో పాటు మాకవరం, లచ్చన్నపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు విక్రయించే ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి అన్నారు. గురువారం వాండ్రాడ గ్రామంలో రైతులు విక్రయించే ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండించిన పంట ఎటువంటి పొల్లు లేకుండా ఇంటికి వచ్చిందని, వాతావారణం కూడా అనుకూలించడంతో ఎటువంటి తేమ లేకుండా ఎండబెట్టి విక్రయించాలని సూచించారు. పంట దిగుబడిని రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నర్సింగపల్లిలో ల్యాండ్ కన్వర్షన్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.అప్పల రాజు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా సంఘాలుగా తీర్చిదిద్దాలి

నరసన్నపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు విజన్ విల్లింగ్ కార్యక్రమంలో మహిళా సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ఈ దిశలో ఏపీఎంలు కృషి చేయాలని డీఆర్‌డీఏ ఏసీ కొండలరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లాలోని 15 మోడల్ పొదుపు సంఘాల మండలాల ఏపీఎంలకు రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. మహిళాసంఘాల సభ్యుల ను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పిల్లల్లో రక్తహీనత లేకుండా చూడండి

మెళియాపుట్టి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో రక్తహీనత లేకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి అన్నారు. గురువారం దీనబంధుపురం అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి నెల ఒకటి నుంచి 5వ తేదీలోగా చిన్నారుల బరువులను పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని, చిన్నారులకు పాఠాలు బోధించాలన్నారు. కేంద్రాలను ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆమెతో పాటు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గురుకులం సమస్యల పరిష్కారానికి కృషి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) అక్కుపల్లి బీసీ గురుకుల పాఠశాల సమస్యలను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన పలాస నియోజకవర్గ సమన్వయ కర్త వి.దుర్గారావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, భవనాల కొరత ఉన్నా వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి కనీసం పట్టించుకోలేదన్నారు. ఆరు తరగతుల్లో 188 మంది విద్యార్థులున్న గురుకులంలో వసతి, వంటశాలకు, తరగతి గదులు సరిపడా గదులు లేవని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 14న నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలో నీటి సంఘాలకు జరిగే పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. వంశధార జేఏఈ శ్రీనివాస రావు, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల నిర్మాణం వేగవంతం చేయండి

పలాస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు గురువారం కోసంగిపురం వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. రహదారులు, విద్యుత్, తాగునీరు, మురుగు కాలువలు పూర్తి చేయాలన్నారు.